క్లుప్తంగా

పీఎంఏవై కింద అర్హులకు ఇళ్ల మంజూరు

పార్వతీపురం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 పథకం కింద అర్హులకు ఇళ్లు మంజూరు చేయనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు గ్రామ సచివాలయాలలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అర్హత కలిగి గతంలో ఇళ్లు మంజూరుకాని వారికి మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హతగల వారు భార్యాభర్తల సంతకంతో ఆధార్ కార్డు నకలు, రేషన్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ మొదటి పేజీ నకలు, స్థలం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఈసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ప్రస్తుత ఇంటిస్థలం ఫొటోతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలన్నింటిని జత చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు.

ఘనంగా వేణుగోపాలుని తిరువీధి


వేణుగోపాల స్వామివారిని పూలపల్లకీలో తిరువీధి చేస్తున్న భక్తులు

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వేకువజామున గోవింద మాలలు ధరించిన భక్తులు స్వామిని పల్లకీలో ఊరేగించారు. ఆలయ అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి సమేత వేణుగోపాలస్వామివారికి ప్రతిరోజూ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పూలతో ప్రత్యేకంగా అలంకరణ పల్లకీలో విగ్రహాలను ఉంచి తిరువీధి నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులందరికీ తీర్థప్రసాదాల వితరణ జరిగింది.

మంచు దుప్పట్లో మక్కువ..



మక్కువలో కురిసిన మంచు దృశ్యాలు

మక్కువ: మండల కేంద్రం మక్కువను ఆదివారం మంచు కప్పేసింది. తెల్లవారు జాము నుంచి ఉదయం 7.30 గంటలవరకు మంచు కురవడంతో రహదారులన్నీ మంచుతో కప్పుకున్నాయి. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. చలితో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 7.30 తరువాత సూర్యుడు దర్శనమివ్వడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పాలకొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని రుషి యోగాకేంద్రం గురూజీ ధనుంజయ తెలిపారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోటదుర్గమ్మ ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఒత్తిడి కలిగిన జీవితంలో యోగా అత్యంత అవసరమని తెలిపారు. మానసిక ఒత్తిడిని తట్టుకుని ఆరోగ్యంగా జీవించడానికి యోగా ప్రధానమన్నారు.

మెరుగైన సదుపాయాలు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో సదుపాయాలు మెరుగుపరచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు కోరారు. ఆ పాఠశాలను ఆదివారంసందర్శించిన ఆయన.. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ లేదని, ఆర్వో ప్లాంట్ పాడైందని తెలుపగా, ఆయా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యార్థిపై భౌతికదాడికి దిగిన తోట యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి బాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎస్ శర్మ యాజీ పర్యవేక్షణలో జై గురుదత్త హోమం, శ్రీచక్రార్చనలు, మహాలింగార్చనలు చేపట్టారు. పార్వతీపురం, వీరఘట్టం, కాటందొరవలస, అంటిపేట, మక్కువ, మునిగూడ ప్రాంతాల భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుగా గోపసాగరం


చెత్తతో నిండిపోయిన గోపసాగరం

పార్వతీపురం టౌన్:

పట్టణంలోని దాదాపు చెరువులన్నీ కబ్జాకు గురవుతున్నాయి. తాజాగా గోప సాగరం కూడా కబ్జాకు గురవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేనంబర్ 102లో గల సుమారు 32 ఎకరాల విస్తీర్ణం కలిగిన గోపసాగరం ఇప్పటికే సుమారు రెండు ఎకరాల వరకు కబ్జాకు గురైంది. ఆ కబ్జా ఎవరో చేస్తే అడ్డుకోవాల్సిన మున్సిపాలిటీయే కబ్జా చేయడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపసాగరం పక్కన మున్సిపాలిటీకి సుమారు 90 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలంలో దశాబ్దాలుగా పార్వతీపురం పట్టణంలో తయారైన రోజువారి చెత్త అంతటిని తెచ్చి డంప్ చేస్తున్నారు. దీంతో ఆ 90 సెంట్ల స్థలం చాలకపోవడంతో పక్కనే ఉన్న గోపసాగరంలో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దాదాపు రెండు ఎకరాల మేర ఇప్పటికే చెత్తను వేసి ఆక్రమించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గోపసాగరం నీటిలో చెత్తను డంప్ చేయడం వల్ల సాగరంలోని చేపలు మత్స్యువాత పడుతున్నాయన్నాయని ఆందోళన చెందుతున్నారు. సుమారు 100 ఎకరాలకు పైగా ఆయకట్టు భూములకు మురుగు నీరు వెళ్తోంది. దీనివల్ల పంటలు నాశనమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. రైతులకు తీవ్రనష్టం జరుగుతోందని, మున్సిపల్ యంత్రాంగం చెత్తతో గోపసాగరాన్ని కబ్జా చేయడం సరికాదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా చెత్త డంపింగ్ యార్డ్ సమస్య మున్సిపాలిటీని వేధిస్తోందన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ

ఎన్నికల సమయంలో ఈ చెత్త డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కంది. అధికారం చేత చిక్కగానే చెత్త డంపింగ్ యార్డ్ సమస్యను పక్కన పడేసింది. ఎన్నికల హామీగానే డంపింగ్ యార్డ్‌ను ఉపయోగించుకుంది. సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గోపసాగరం కబ్జాకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణమే గోపసాగరంలోని కబ్జాలను తొలగించి, గోపసాగరాన్ని శుద్ధి చేయాలని కోరుతున్నారు.

ఎన్నికల హామీని నెలబెట్టుకోవాలి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. డంపింగ్ యార్డును తక్షణమే ఇక్కడి నుంచి తరలించాలి. మున్సిపల్ సిబ్బంది చెరువులో చెత్తను వేయడం ఆపాలి. ఈ విషయమై పలు మార్లు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాం. అయినా ఫలితం లేకపోయింది.

– మీసాల ప్రసాద్, పార్వతీపురం

పట్టణంలోని చెత్తను చెరువులో వేస్తున్నారు

పట్టణంలో తయారైన రోజువారి చెత్తను తీసుకువచ్చి చెరువులో వేస్తున్నారు. దీనివల్ల ఈ మధ్యకాలంలో చెరువులోని చేపలన్నీ చనిపోయాయి. మత్స్యకారులకు తీవ్రనష్టం చేకూరింది. అధికారులు తక్షణమే చర్య చేపట్టాలి. డంపింగ్ యార్డును తరలించాలి.

– బి.అశోక్, పట్టణ వాసి

చెరువును శుద్ధి చేయాలి

గోపసాగరం చెరువులో మున్సిపాలిటీ సిబ్బంది చెత్తను వేసి ఆక్రమణలు చేపడుతున్నారు. చెరువులో నీరు కలుషితమై రైతులు, మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదు. ఎన్నికలలో టీడీపీ ఇచ్చిన హామీల్లో భాగంగా డంపింగ్ యార్డును తరలించాలి.

– వంగపండు శంకర్రావు, రైతు, పార్వతీపురం

ఘనంగా గణిత దినోత్సవం


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రజనీకాంత్ మాస్టారు తదితరులు

సాలూరు: ప్రముఖ భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని సాలూరు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామానుజన్ మేథమెటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో వరుసగా 24వ సంవత్సరం పట్టణంలో ఈ వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని సత్యసాయి జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన గణిత ప్రతిభ పరీక్ష విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సాలూరు రామానుజన్ మేథమెటిక్స్ క్లబ్ వ్యవస్థాపకుడు రంభ రజనీకాంత్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో 18 హైస్కూల్స్ నుంచి 829 మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొన్నారని తెలిపారు. మక్కువ పెంచుకుంటే గణితం చాలా సులభమని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గౌరీశంకరరావు, ప్రసాద్, సంతోష్‌కుమార్, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై ఆసక్తి పెంపొందించుకోవాలి

గణితంపై ఆసక్తి పెంపొందించుకోవాలని, గణితం కష్టమనే భావనను విద్యార్థులు విడనాడాలని 24వ వార్డు కౌన్సిలర్ బీసా హైమావిజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని డబ్బివీధిలో గల ట్యూషన్ సెంటర్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతిని ఆదివారం నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులకు ట్యూషన్ సెంటర్‌లో గణిత పోటీ పరీక్షలు నిర్వహించారు. ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులకు చిన్నప్పటి నుంచి శిక్షణ ఇస్తున్నట్లు ట్యూషన్ ఉపాధ్యాయుడు బీసపు బాలకృష్ణ తెలిపారు.


ట్యూషన్ సెంటర్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

27న నిరసన ర్యాలీ

వీరఘట్టం: ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వం, అధికారం చేపట్టాక ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఈ మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 27న పాలకొండలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. పెరిగిన విద్యుత్ బిల్లులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ర్యాలీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కార్మికులను ఆదుకోవాలి

పాలకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, జాతీయ ఆరోగ్య మిషన్ కార్మికులు, మెప్మా సిబ్బందికి జీవనభృతి కల్పించాలని కోరారు. బడ్జెట్‌లో నిధులు పెంచి వారికి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడులు..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు గ్రామ శివారులో స్థానిక బ్రిడ్జి వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేపట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,510 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం..


గూడపువలసలో కొబ్బరిసాగులో అంతర పంటగా వేసిన అరటిసాగు

● అన్నదాతలకు ఆర్థిక భరోసా

పూసపాటిరేగ: ఉద్యానవన తోటల్లో అంతర పంటలు సాగు చేస్తూ రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో అత్యధికంగా కొబ్బరి సాగవుతోంది. వాటిలో అంతరపంటగా అరటి, జామి, కోకో మొదలగు పంటలు వేసి రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారు. ఎకరాకు సుమారు రూ. 50 వేల నుంచి 70 వేల రూపాయల వరకు కళ్లజూస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలలో కొబ్బరిసాగు జరుగుతోంది. వాటిలో సుమారు 6,500 ఎకరాలలో వివిధ రకాల అంతర పంటలు సాగు చేస్తున్నారు. తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, కొణతాలపాలెం, కృష్ణాపురం, చౌడువాడ, రోలుచప్పిడి, చినపతివాడ, పెదపతివాడ, రాయుడుపేట, రెల్లివలస, కోనయ్యపాలెం, ముక్కాం, చేపలకంచేరు, దిబ్బలపాలెం, గూడపువలస, ముంజేరు, తదితర గ్రామాలలో కొబ్బరి సాగు చేస్తున్నారు.

తెగుళ్లకు చెక్..

ఉద్యానవన సాగులో అంతరపంటలు వేయడం వల్ల భూములకు ఎంతో మేలు జరుగుతుందని ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న తెలిపారు. అంతరపంటల వల్ల తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందన్నారు. అంతర పంటల కోసం భూములు బాగా దున్నడం వల్ల తెగుళ్లు నివారించబడతాయని చెప్పారు. అలాగే భూసారం కూడా పెరుగుతుందని తెలిపారు.


రెల్లివలసలో కొబ్బరిలో అంతర పంటగా వేసిన అల్లం

లాభాలు ఆర్జిస్తున్నాం..

కొబ్బరిసాగులో అరటి వేయడంతో లాభాలు ఆర్జిస్తున్నాం. ఒకే భూమిలో రెండు రకాల సాగులు ఏకకాలంలో జరగడం వల్ల నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నాం. అంతర పంటల వల్ల భూమి కూడా సారవంతమవుతోంది.

– పి.రామునాయుడు, రైతు, పతివాడ

అంతర పంటలతో అదనపు ఆదాయం

అంతర పంటలతో అదనపు ఆదాయం సమకూరుతుంది. ఎరువులు, నీటి వృథా జరగదు. తోటలలో సూక్ష్మ వాతావరణం ఉంటుంది. కొబ్బరి సాగులో కోకో, జామి అంతర పంటలుగా వేయడంతో లాభాలు వస్తున్నాయి.

– జ్యోత్స్న, భోగాపురం ఉద్యానవనశాఖ అధికారి

మంచినీటి పథకానికి కొత్త పైప్‌లైన్

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నది నుంచి సీతానగరంలోని ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న వాటర్ నిల్వ ఉంచే సంప్ వరకూ కొత్తగా పైప్‌లైన్ నిర్మాణం చేసి తాగునీరు సరఫరాకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు సువర్ణముఖి నదిలోని వాటర్‌ఫిల్టర్ బావిని ఆదివారం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నదిలో ఇన్‌వెల్ నిర్మాణం చేసి అమర్చిన మోటార్ల ద్వారా స్థానిక ఉన్నత పాఠశాలలో అమర్చిన సంప్ వరకూ ఉన్న పైప్‌లైన్, విద్యుత్ వైర్లు రైల్వేశాఖ మూడో లైన్ కింద ఇమిడి పోవడంతో సాంకేతిక పరమైన ఇబ్బందులు వచ్చాయన్నారు. దీంతో చిన్నారాయుడుపేట, అప్పయ్యపేట, జోగింపేట, గుచ్చిమి మరిపివలస, సూరంపేట గ్రామాలకు తాగునీరు సక్రమంగా అందక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. పైప్‌లైన్ మరమ్మతులకు గురైనట్లు గుర్తించి కొత్తగా పాత బీటీ రోడ్డును ఆనుకుని పైప్‌లైన్ వేశామన్నారు. రెండు రోజుల్లో నిర్దేశించిన గ్రామాలకు తాగునీరు సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు. ఆయనతో పాటు ఏఈ ఆర్.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలకు లోబడి పనులు చేయాలి


మేదరవీధిలో జరుతున్న సీసీ రోడ్డు పనులు

సీతానగరం: మండలంలో జరుగుతున్న సీసీరోడ్లు, కాలువల పనులు నాణ్యతాప్రమాణాలకు లోబడి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని మండల ఇంజినీర్ జి.చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో మేదరవీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 67 పనులు మంజూరైనట్లు తెలియజేశారు. పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన జరుగుతున్నాయని అందుకు కారణం ప్రతి కూలవాతావరణమేనన్నారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున పనులు ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు చేయాలని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.తేరేజమ్మ, త్రినాథ్, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రిస్మస్ వెలుగులు

- 25న వేడుకలు
- ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు
- మార్కెట్‌లో విక్రయిస్తున్న స్టార్లు


సీతానగరం: అందంగా తీర్చిదిద్దిన పెదభోగిలి లూథరన్ చర్చి

బలిజిపేట:

గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. ఈ నెల 25న వేడుకను ఘనంగా నిర్వహించడానికి క్రైస్తవ సోదరులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏసు ప్రభువు జననం దీనులను, పాపులను రక్షించేందుకే అనేది విశ్వాసుల నమ్మకం. చర్చిలలో ఇప్పటికే క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. అందులో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టారు. ప్రేమ, క్షమాపణ, నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించాలి, సన్మార్గంలో పయనించాలన్న క్రీస్తు ప్రబోధాలు సర్వమానవాళికి అనుసరణీయం. ప్రజల కోసం తన రక్తాన్ని చిందించిన క్రీస్తు జన్మదినం ప్రపంచ మానవాళికి పండగ రోజు. ఈ సందర్భంగా గ్రామాల్లోని చర్చిలు, క్రైస్తవుల ఇళ్లను సుందరంగా ముస్తాబు చేసుకున్నారు. డిసెంబరు ప్రారంభం నుంచి జనవరి నెల ఒకటో తేదీ వరకు గ్రామాల్లోని వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుంటారు. ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 25న క్రిస్మస్ వేడుకలు జరుగుతాయి.

అలంకరణలకు ప్రాధాన్యం

సంబరంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు అలంకరణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. వారి అభిరుచులకు అనుగుణంగా మార్కెట్లో అలంకరణ సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో షాపులన్నీ కిటకిటలాడుతున్నాయి. క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్, కీచైన్స్, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపే వివిధ రకాల వస్తువుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రకరకాల స్టార్స్ ఎక్కువగా మార్కెట్‌లో కనిపిస్తున్నాయి.


వెంగాపురం చర్చిలో ఏర్పాటు చేసిన కొబ్బరితాళ్ల స్టార్

చర్చిల్లో సందడి

డిసెంబరు వచ్చిందంటే క్రైస్తవ కుటుంబాల్లో పండగ వాతావరణం ప్రారంభమవుతుంది. ఈ నెల ప్రారంభం నుంచే చాలామంది క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభిస్తారు. చర్చిల్లో చిన్నారులు, యువతకు బైబిల్‌పై ప్రతి ఆదివారం ప్రత్యేక బోధన నిర్వహిస్తారు. క్రీస్తు బోధనలు పాటించి సన్మార్గంలో నడవాలని సూచిస్తారు. చిన్నారులు, యువత ఈ నెలరోజుల్లో తమ గ్రామాల్లో నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో క్రీస్తుజననం, క్రీస్తు జీవితం, ఆయన చేసిన అద్భుతాలు, బైబిల్‌లోని పలువురు ప్రవక్తల పాలనపై నాటికలు, నృత్యాలు, ప్రదర్శిస్తారు. బైబిల్‌లోని అంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రోత్సాహకాలు అందిస్తారు. మొత్తం మీద క్రిస్మస్ సందడి, హంగామా ఎక్కువగా గ్రామాల్లో కనిపిస్తోంది.


వెంగాపురం పురవీధుల్లో క్రైస్తవ భక్తుల దీపారాధన

సిద్ధమైన చర్చిలు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించడానికి క్రైస్తవులు చర్చిలను అంగరంగ వైభవంగా అలంకరణ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ మేరకు పెదభోగిలిలో లూథరన్ చర్చి నిర్వాహకులు అలంకార ప్రాయంగా తీర్చారు.


సీతానగరం: లూథరన్ చర్చిలో జ్యోతులతో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

మన్యంలో పర్యాటకుల సందడి

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. అడ్వెంచర్ పార్కులో వివిధ సాహస క్రీడల్లో పాల్గొన్నారు. జలవిహార్‌లో బోటుషికారు, హ్యాంగింగ్ బ్రిడ్జిపై సందడి చేశారు. అలాగే మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. అడలి వ్యూ పాయింట్‌ను సందర్శించి ఏజెన్సీ అందాలు చూశారు.